జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 138 01-6-2026 వెల: రూ.2/- పేజీలు: 06






## ఆర్సీబీ డబుల్ డిలైట్..

తేదీలు మారడం మినహా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు ప్రస్థానం సరిగ్గా 2025 తరహాలోనే సాగి టైటిల్ వరకు చేరింది. లీగ్ దశలో 9 విజయాలతో అగ్రస్థానం, తొలి క్వాలిఫయర్‌లో ఏకపక్ష గెలుపుతో ఫైనల్‌కు... తుది పోరులో కూడా సంపూర్ణ ఆధిపత్యం... డిఫెండింగ్ చాంపియన్‌గా సొంతగడ్డ బెంగళూరులో మళ్లీ ట్రోఫీని ముద్దాడతామని గత ఏడాది గర్వంగా చెప్పినా... వేర్వేరు కారణాలతో అది జరగలేదు. కానీ మళ్లీ అదే అహ్మదాబాద్ వేదికపై

విజయానందాన్ని సొంతం చేసుకుంది. 18వ సీజన్‌లో తొలిసారి 'ఈ సాలా కప్ నమ్‌దు' అంటూ గర్జించిన జట్టు మరోసారి అదే ధ్వనిని బిగ్గరగా వినిపించింది. నాడు విజేతగా నిలిచిన జట్టులోని 13 మంది ఈసారి కూడా గెలుపులో భాగమై తమ ఆనందాన్ని రెట్టింపు చేసుకున్నారు.

- మిగతా 2వ పేజీలో

### ఎమ్మెల్యేలు జమీందార్లలా మారొద్దు..

## పార్టీ కోసం పనిచేయాల్సిందే

**సోషల్ మీడియా ప్రచారంపై ఎమ్మెల్యేలకు సీఎం క్లాస్**
**పార్టీ కోసం పనిచేయడంలో ఎవరికీ మినహాయింపు లేదన్న రేవంత్**
**ప్రతి 10 రోజులకు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని మంత్రులకు ఆదేశం**
**వలస ఓటర్ల ఓట్లు డిలీట్ కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచన**

కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధులు, మంత్రుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్టీ కోసం కష్టపడే విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తూనే, క్షేత్రస్థాయిలో కొంతమంది ఎమ్మెల్యేల ప్రవర్తనపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ క్యాడర్ అంతా సోషల్ మీడియా వారియర్లుగా మారి, ప్రాణాలకు తెగించి పార్టీ కోసం పనిచేశారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు 'జమీందార్లు'గా తయారయ్యారని ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సదరు ఎమ్మెల్యేలు సోషల్ మీడియాలో కేవలం తమ



మిగతా 2లో




## జెన్ జీ ఆశయాలకు అనుగుణంగా 'సేనా గళం' ఏర్పాటు...

- 'సేనా గళం' పేరుతో కొత్త కమిటీని ప్రకటించిన పవన్ కల్యాణ్
- పాత పద్ధతులకు స్వస్తి పలుకుతూ జనసేన కీలక నిర్ణయం
- ముల్లును ముల్లుతో తీసే ధోరణిని తోసిపుచ్చిన జనసేనాని
- వ్యక్తిగత తప్పులకు కులాలను ఆపాదించవద్దని స్పష్టం
- సామాజిక సామరస్యం, బాధ్యతాయుత రాజకీయాలే లక్ష్యం

2లో

## విశాఖ రైల్వే జోన్ రేపటి నుంచే...

**జూన్ 1 నుంచి విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభం**
**ఇది చారిత్రాత్మక మైలురాయి అని సీఎం చంద్రబాబు వ్యాఖ్య**
**దశాబ్దాల కల నెరవేరిందని హర్షం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి**
**ఆకాంక్షను నెరవేర్చిన ప్రధాని మోదీకి, రైల్వే మంత్రికి ధన్యవాదాలు**
**ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ జోన్ కీలకం కానుందని వెల్లడి**



విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ రేపు (జూన్ 1న) అధికారికంగా ప్రారంభం కానుండటంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక మైలురాయి అని, దశాబ్దాల కల నెరవేరుతోందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన రైల్వే జోన్‌తో ఉత్తరాంధ్ర రవాణా ముఖచిత్రం సమూలంగా మారిపోతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. దీనివల్ల కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించబడటంతో పాటు పారిశ్రామిక వృద్ధికి కూడా బాటలు పడతాయని తెలిపారు. రాష్ట్రాన్ని ఒక లాజిస్టిక్స్

మిగతా 2లో



## క్రీడాకారుల జుగల్‌బందీ

- అథ్లెటిక్స్‌లో వరుస రికార్డులతో దేశ కీర్తిని పెంచారు
- 'మన్ కీ బాత్'లో ప్రధాని ప్రశంస

న్యూఢిల్లీ: భారత క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో ప్రతిభా పాటవాలు చాటుతూ దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. అథ్లెటిక్స్ రంగంలో దేశ క్రీడాకారులు సాధించిన విజయాలను ప్రస్తావించారు. ఆదివారం 134వ మన్ కీ బాత్ ఎపిసోడ్‌లో ద్వారా దేశ ప్రజలనుద్దేశించి ఆయన రేడియోలో ప్రసంగించారు.

2లో

## హామీలు నెరవేర్చాకే ఎన్నికల్లో పోటీ చేయాలి

**420 హామీలు, ఆరు గ్యారెంటీలు అమలు చేశాకే ఎన్నికల్లో పోటీ చేయాలని సీఎంకు కేటీఆర్ సవాల్**
**ఫార్మర్స్ డిస్కం పేరుతో 24 గంటల ఉచిత విద్యుత్‌ను రద్దు చేసేందుకు కాంగ్రెస్ కుట్ర**
**రైతులకు మూడు గంటల కరెంట్ చాలన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను గుర్తు చేసిన కేటీఆర్**
**ఇందిరమ్మ ఇళ్లు సహా ఏ ఒక్క హామీని ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శ**
**ఫార్మర్స్ డిస్కం రైతుల మెడకు ఉరితాడుగా మారుతుందని వ్యాఖ్య**



కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేశాకే భవిష్యత్ ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించే దమ్ము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తే ఎన్నికల్లో పోటీ చేయనని సీఎం చెప్పడం ప్రజలను మరోసారి మోసం చేయడానికేనని ఆయన ఆరోపించారు. ఆదివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో ఫార్మర్స్ డిస్కం ఏర్పాటు ప్రతిపాదన వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. రైతులకు కేసీఆర్ అందించిన

2లో

## ఎన్నిసార్లు దొరికిపోయినా మీ కుట్ర, క్షుద్ర రాజకీయాలు మానరా జగన్?

- నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం
- ఇది వైసీపీ నేతల కుట్ర అని లోకేష్ ఫైర్
- జగన్ తన 'గొడ్డలి పార్టీ' కార్యకర్తలతో అశాంతి సృష్టిస్తున్నారని విమర్శలు
- జగన్ కుట్ర రాజకీయాలు మానడం లేదని ఆగ్రహం



## ఎన్నిసార్లు దొరికిపోయినా మీ కుట్ర, క్షుద్ర రాజకీయాలు మానరా జగన్?

వైసీపీ అధినేత జగన్ పై మంత్రి నారా లోకేష్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు జగన్ తన గొడ్డలి పార్టీ కార్యకర్తలను రంగంలోకి దింపారని లోకేష్ ఆరోపించారు. జగన్ నాటకాలు చూసి ప్రజలు విసిగిపోయినా, ఆయన తన డ్రామాలు ఆపడం లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. నంద్యాలలో ఇటీవల జరిగిన వైఎస్సార్ విగ్రహ ధ్వంసం ఘటనను ప్రస్తావిస్తూ, దీని వెనుక వైసీపీ కుట్ర ఉందని లోకేష్ ఆరోపించారు. ఈ ఘటనలో నిందితుడైన జమ్ములయ్య, స్థానిక వైసీపీ నేతల అనుచరుడేనని పోలీసుల విచారణలో తేలిందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉటంకిస్తూ, జగన్ తన 'గొడ్డలి పార్టీ' కార్యకర్తలతో అశాంతి సృష్టిస్తున్నారని విమర్శించారు. బాబాయ్ గుండెపోటు, కోడి కత్తి, గులకరాయి వంటి నాటకాలతో ప్రజలను మోసం చేసిన జగన్, ఇప్పుడు కూడా అదే తరహా కుట్ర రాజకీయాలు చేస్తున్నారని లోకేష్ మండిపడ్డారు. "ఎన్నిసార్లు దొరికిపోయినా మీ కుట్ర, క్షుద్ర రాజకీయాలు మానరా జగన్?" అంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. అధికారంలో లేకపోయినా జగన్ తీరు మారడం లేదని లోకేష్ వ్యాఖ్యానించారు.

## హామీలు నెరవేర్చాకే ఎన్నికల్లో పోటీ చేయాలి

24 గంటల ఉచిత విద్యుత్‌ను రద్దు చేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కొత్త డ్రామాకు తెరలేపిందని విమర్శించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతులకు మూడు గంటల కరెంట్ చాలని చెప్పిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు అదే విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. "ఫార్మర్స్ డిస్కం అనేది రైతుల మెడకు ఉరితాడు. ఉచిత విద్యుత్‌ను పూర్తిగా ఎత్తివేయడమే దీని అంతిమ లక్ష్యం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం సహా ఏ ఒక్క హామీని ఈ ప్రభుత్వం నెరవేర్చలేదని, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను రైతులు, పట్టణ ప్రజలు కూడా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాకముందు కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలతో పరిశ్రమలు పవర్ హాలిడేలు ప్రకటించేవని, రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చి, దేశంలోనే తొలిసారిగా వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

## డబ్బుల్లేవ్..ఓపిక పట్టండి!

హైదరాబాద్: 'రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేదు. ప్రతి నెలా అవుతున్న ఖర్చులకు ఖజానాకు వచ్చే రాబడులు సరిపోవడం లేదు. అనివార్య ఖర్చులు పెరిగిపోతున్నాయి. అదనపు ఆదాయం వచ్చే మార్గాలు కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో కొత్త పథకాలను అమలు చేయలేకపోతున్నాం. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో భాగంగా సామాజిక పింఛన్లు పెంచేందుకు ఎంత ప్రయత్నించినా నిధులు సమకూరడం లేదు. మీమీ నియోజకవర్గాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం డబ్బులు ఇప్పట్లో ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కొన్నాళ్లు సర్దుకుపోవాల్సి ఉంటుంది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన తర్వాత యుద్ధ ప్రాతిపదికన క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను ముమ్మరం చేస్తాం..' అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఆర్థిక పాఠాలు చెబుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటై రెండున్నరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో పార్టీ ప్రజా ప్రతినిధులకు వాస్తవ పరిస్థితులను తెలియజెప్పాలనే ఆలోచనతో ఉమ్మడి జిల్లాల వారీగా ఆయన ఎమ్మెల్యేలతో సమావేశమవుతున్నారు. ఇప్పటివరకు ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నల్లగొండ జిల్లాల ఎమ్మెల్యేలు, మంత్రులతో సమావేశమైన ఆయన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరిస్తూనే, ఆదాయం పెంచుకునే మార్గాల గురించి ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలని కోరుతున్నట్టు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వ ప్రస్తుత ఆర్థిక పరిస్థితి గురించి భట్టి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరణ ఇస్తున్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వచ్చిన రాబడులు, చేసిన అప్పులు, కాంగ్రెస్ హయాంలో ఆదాయ, వ్యయాలను సంవత్సరాల వారీగా తెలియజేస్తున్నారు. 'ప్రస్తుతం ప్రతి నెలా రూ.16--17 వేల కోట్ల వరకు ఆదాయం వస్తుంటే రూ.18--20వేల కోట్ల వరకు ఖర్చులవుతున్నాయి. ఆదాయం కంటే ప్రతి నెలా రూ.2,200 కోట్ల వరకు అధికంగా వ్యయమవుతోంది. ఈ పరిస్థితుల్లో కొత్త పథకాల అమలు అసాధ్యం. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై రూపాయి కూడా అదనంగా పన్ను వేయకుండా నెట్టుకొస్తున్నాం. జీఎస్టీ, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, వాహనాలకు పన్నులు, కేంద్రం నుంచి వచ్చే నిధులు, ఇతర ఆదాయంతో సర్దుకుంటున్నాం. పాత పథకాలేవీ తీసేసే పరిస్థితి లేదు. సంక్షేమ పథకాల అమలుకు, ఉద్యోగుల జీతాలు, పింఛన్లకు ప్రతి నెలా నిధులిస్తున్నాం. కొత్త అప్పులు తెచ్చినా పరిస్థితిలో మార్పు రావడం లేదు. పాత అప్పులే పీకల వరకు ఉన్న నేపథ్యంలో తెచ్చిన దాని కంటే ఎక్కువగా అప్పులు కట్టాల్సి వస్తోంది. వీటికి తోడు అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపులు, పరిపాలనా వ్యయం, విద్య, వైద్యం వంటి కీలక రంగాల నిర్వహణ కోసం కష్టపడాల్సి వస్తోంది. ఏరోజుకారోజు సర్దుకోవాల్సిన పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయి. ఈ ఏడాది మొత్తం ఇదే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నాం. ఆర్థిక పరిస్థితిని దారిలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. మీమీ నియోజకవర్గాల్లో అభివృద్ధి నిధుల కోసం కొంచెం ఓపిక పట్టండి. పరిస్థితిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించండి..' అని భట్టి చెబుతున్నట్టు తెలిసింది. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకునేందుకు ఉన్న మార్గాల గురించి సలహాలు, సూచనలు ఇవ్వాలని ఎమ్మెల్యేలను డిప్యూటీ సీఎం కోరుతున్నారు. ఈ సమావేశాల్లో పాల్గొన్న కరీంనగర్‌కు చెందిన ఓ ఎమ్మెల్యే 'సాక్షి'తో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని తెలియజేయడం మంచిదే. మేం కూడా కొన్ని సలహాలిచ్చాం. పాత పథకాలేవీ తీసేయవద్దని చెబుతూనే కొంతమేరకు క్రమబద్ధీకరించాల్సిన ఆవశ్యకతను వివరించాం. రైతు భరోసాను కుదించాలని, పింఛన్లు ప్రతి యేటా కొంత పెంచాలని, ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ బీమా లాంటి పథకాలు ప్రజల్లో మంచి పేరు తెస్తాయని, అవసరమైతే నిరుపయోగమైన ప్రభుత్వ భూములను అమ్మడం ద్వారా ఆదాయ వనరులు పెంచుకునే అవకాశాలను పరిశీలించాలని సూచించాం. పార్టీ కార్యకర్తలు గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఇవ్వాలని అడిగాం. మా నియోజకవర్గాల్లోని రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన గురించి ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. రిజి?రస్టేషన్ల రేట్లు పెంచినా పర్వాలేదని చెప్పాం. ఇచ్చిన హామీలను అమలు చేసిన తర్వాతే ఓట్ల కోసం వచ్చామనే భావన ప్రజల్లో కలిగించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించాం..' అని వెల్లడించారు.

# ఆర్సీబీ డబుల్ డిలైట్..

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో వరుసగా రెండుసార్లు విజేతగా నిలిచిన మూడో జట్టుగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన ఆర్సీబీ ఐపీఎల్--2026 టైటిల్‌ను గెలుచుకుంది. నరేంద్ర మోదీ స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్లో ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. వాషింగ్టన్ సుందర్ (37 బంతుల్లో 50 నాటౌట్; 5 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. ఆర్సీబీ బౌలర్లలో రసిఖ్ సలామ్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బెంగళూరు 18 ఓవర్లలో 5 వికెట్లకు 161 పరుగులు చేసి గెలిచింది. విరాట్ కోహ్లి (42 బంతుల్లో 75 నాటౌట్; 9 ఫోర్లు, 3 సిక్సలు) చెలరేగిపోగా, వెంకటేశ్ అయ్యర్ (16 బంతుల్లో 32; 4 ఫోర్లు, 2 సిక్సలు) ధాటిగా ఆడాడు.

ప్రతీ సీజన్‌లో జట్టు బ్యాటింగ్ భారం మోస్తున్న ముగ్గురు ప్రధాన బ్యాటర్లు తొందరగా వెనుదిరగడంతోనే గుజరాత్ భారీ స్కోరు ఆశలు కోల్పోయింది. శుబ్‌మన్ గిల్ (8 బంతుల్లో 10; 2 ఫోర్లు), సాయి సుదర్శన్ (12 బంతుల్లో 12; 2 ఫోర్లు) నాలుగు పరుగుల వ్యవధిలో అవుట్ కాగా, నిశాంత్ సింధు (18 బంతుల్లో 20; 3 ఫోర్లు) ప్రభావం చూపలేదు. పవర్‌ప్లేలో జట్టు 45 పరుగులే చేసింది. క్రీజ్‌లో ఉన్నంత సేపు తడబడిన జోస్ బట్లర్ (23 బంతుల్లో 19; 1 ఫోర్) సహనం కోల్పోయి వికెట్ సమర్పించుకున్నాడు.

**శుభారంభం...**

ఛేదనలో వెంకటేశ్, కోహ్లి జట్టుకు మెరుపు ఆరంభాన్ని అందించారు. తొలి ఓవర్లో సిరాజ్ 5 పరుగులే ఇచ్చినా... రబాడ వేసిన తర్వాత ఓవర్లో వెంకటేశ్ 3 ఫోర్లు, సిక్స్ బాదాడు. సిరాజ్ రెండో ఓవర్లోనూ 3 బౌండరీలు రాగా... రబాడ తర్వాతి ఓవర్లో కోహ్లి వరుసగా 4, 4, 6, 4తో చెలరేగిపోయాడు. వెంకటేశ్, పడిక్కల్ (1) పరుగు తేడాతో వెనుదిరగ్గా... పవర్‌ప్లేలో జట్టులో 70 పరుగులు చేసింది. ఆ తర్వాత కెపట?టన్ రజత్ పాటీదార్ (13 బంతుల్లో 15; 1 ఫోర్, 1 సిక్స్), కృనాల్ పాండ్యా (1)లను రషీద్ ఒకే ఓవర్లో అవుట్ చేసి కొంత ఒత్తిడి పెంచాడు. అయితే కోహ్లి మాత్రం తగ్గకుండా దూసుకుపోయాడు. 25 బంతుల్లో అతని అర్ధసెంచరీ పూర్తయింది. టిమ్ డేవిడ్ (17 బంతుల్లో 24; 3 ఫోర్లు, 1 సిక్స్) కీలక పరుగులు జోడించగా... విరాట్ చివరి వరకు నిలిచి జట్టును విజయతీరం చేర్చాడు.

**స్కోరు వివరాలు**

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 12; గిల్ (సి) పాటీదార్ (బి) హాజల్‌వుడ్ 10; నిశాంత్ (సి) పడిక్కల్ (బి) సలామ్ 20; బట్లర్ (స్టంప్డ్) జితేశ్ (బి) కృనాల్ 19; సుందర్ (నాటౌట్) 50; అర్షద్ (సి) సలామ్ (బి) హాజల్‌వుడ్ 15; తెవాటియా (సి) పాటీదార్ (బి) సలామ్ 7; హోల్డర్ (సి) హాజల్‌వుడ్ (బి) భువనేశ్వర్ 7; రషీద్ (సి) షెఫర్డ్ (బి) సలామ్ 7; రబాడ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 155. వికెట్ల పతనం: 1--22, 2--26, 3--55, 4--73, 5--99, 6--115, 7--142, 8--151. బౌలింగ్: డఫీ 4--0--38--0, భువనేశ్వర్ 4--0--29--2, హాజల్‌వుడ్ 4--0--37--2, సలామ్ 4--0--27--3, కృనాల్ 4--0--23--1.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: వెంకటేశ్ (సి) రబాడ (బి) సిరాజ్ 32; కోహ్లి (నాటౌట్) 75; పడిక్కల్ (సి) అర్షద్ (బి) రబాడ 1; పాటీదార్ (సి) రబాడ (బి) రషీద్ 15; కృనాల్ (ఎల్బీ) (బి) రషీద్ 1; డేవిడ్ (సి) బట్లర్ (బి) అర్షద్ 24; జితేశ్ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 2; మొత్తం (18 ఓవర్లలో 5 వికెట్లకు) 161. వికెట్ల

పతనం: 1--62, 2--63, 3--89, 4--91, 5--132. బౌలింగ్: సిరాజ్ 4--0--36--1, రబాడ 3--0--44--1, హోల్డర్ 2--0--16--0, రషీద్ 4--0--25--2, అర్షద్ 4--0--32--1, ప్రసిధ్ 1--0--7--0.



## జెన్ జీ ఆశయాలకు అనుగుణంగా 'సేనా గళం' ఏర్పాటు...

జనసేన పార్టీలో సరికొత్త అధ్యాయానికి ఉప ముఖ్యమంత్రి, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారు. సామాజిక సామరస్యం, బాధ్యతాయుత రాజకీయాలు, రాజ్యాంగ విలువల పరిరక్షణ... ముఖ్యంగా జెన్ జీ యువత ఆశయాలకు అనుగుణంగా గళం వినిపించడమే లక్ష్యంగా 'సేనా గళం' అనే కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. కుల, మత రాజకీయాలతో సమాజాన్ని విభజించే ధోరణులకు వ్యతిరేకంగా ఈ కమిటీ పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. 'ముల్లును ముల్లుతోనే తీయాలి' అనే పాతకాలపు, బూర్జువా రాజకీయ ధోరణులకు జనసేన చరమగీతం పాడుతుందని తేల్చిచెప్పారు. ఒక కులం వారు విమర్శిస్తే, అదే కులం వారితో బదులిప్పించే పద్ధతిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి బూజుపట్టిన విధానాలకు తిలోదకాలిచ్చి, అభ్యుదయ భావాలతో ముందుకు సాగాలన్నదే జనసేన ఉద్దేశమని వివరించారు. సమకాలీన రాజకీయాల్లో కొందరు వ్యక్తులు తాము చేసే తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కులం, మతం, ప్రాంతం వంటి సున్నితమైన అంశాల ముసుగు వేసుకుంటున్నారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిగత తప్పిదాలకు సామాజిక వర్గాలను బాధ్యుల్ని చేస్తూ సమాజంలో విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, ఈ తరహా రాజకీయాలను నేటి యువత (జెన్-జీ) తీవ్రంగా వ్యతిరేకిస్తోందని అన్నారు. 'సేనా గళం' కమిటీ.. రాజ్యాంగ విలువలకు కట్టుబడి, దేశ సమగ్రతకు భంగం కలగకుండా పనిచేస్తుందని తెలిపారు. ముఖ్యంగా యువత ఆశయాలకు అనుగుణంగా గళం వినిపిస్తుందని దిశానిర్దేశం చేశారు. వ్యక్తిగత తప్పులను వ్యక్తిగత స్థాయిలోనే ప్రశ్నించాలి తప్ప, ఆ వ్యవహారంలోకి కులాలను, మతాలను లాగకూడదనేది జనసేన పార్టీ స్పష్టమైన విధానమని పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు.

## ఎమ్మెల్యేలు జమీందార్లలా మారొద్దు.. పార్టీ కోసం పనిచేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తిగత ప్రచారం తప్ప.. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను అస్సలు ప్రచారం చేయనివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి మారాలని, సోషల్ మీడియాను ఎలా ఉపయోగించాలనే అంశంపై ఎమ్మెల్యేలందరికీ ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు. పార్టీ అధికారంలోకి రావడానికి కారణమైన కార్యకర్తలను, క్యాడర్‌ను ప్రజాప్రతినిధులు విస్మరించకూడదని సీఎం హెచ్చరించారు. "పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కచ్చితంగా పనిచేయాల్సిందే. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు... ఇలా ప్రతి ఒక్కరూ పార్టీ కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొనాలి. ఇందులో నాతో పాటు ఎవరికీ ఎలాంటి మినహాయింపులు లేవు" అని రేవంత్ రెడ్డి కరాఖండిగా తేల్చి చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో దాదాపు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేశామని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఇకపై ఇన్చార్జ్ మంత్రులు ప్రతి 10 రోజులకు ఒక రోజును పూర్తిగా పార్టీ కార్యక్రమాల కోసమే కేటాయించాలని, నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి కార్యకర్తలను కలవాలని సీఎం ఆదేశించారు. కేవలం మంత్రులకే కాకుండా తనకు కూడా ఈ రూల్ వర్తిస్తుందని చెబుతూ.. తాను కూడా ప్రతి 10 రోజులకు ఒకసారి క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలను కలుస్తానని, నెలలో మూడు రోజులు కేవలం కార్యకర్తల కోసమే సమయం ఇస్తానని రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీంతో పాటు రాబోయే రోజుల్లో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు పోయిన కాంగ్రెస్ అనుకూల ఓటర్ల ఓట్లు తొలగిపోకుండా (డిలీట్ కాకుండా) చాలా జాగ్రత్త పడాలని పార్టీ నాయకులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## విశాఖ రైల్వే జోన్ రేపటి నుంచే...

(మొదటి పేజీ తరువాయి)

హబ్‌గా మార్చే ప్రభుత్వ లక్ష్యానికి ఈ పరిణామం ఎంతో దోహదపడుతుందని వివరించారు. ఏపీ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు రాష్ట్ర ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చంద్రబాబు తన ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త రైల్వే జోన్ ఏర్పాటుతో ఈ ప్రాంత అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# క్రీడాకారుల జుగల్‌బందీ

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా జార్ఖండ్‌లోని రాంచీలో జరిగిన జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ పోటీల్లో నాలుగు కొత్త జాతీయ రికార్డులు నెలకొల్పిన క్రీడాకారులపై ప్రశంసల వర్షం కురిపించారు. గురీందర్‌వీర్ సింగ్, విశాల్ టీకే, తేజస్విన్ శంకర్, దేవ్ మీనా, కులదీప్ కుమార్... ఈ స్నేహితులు వివిధ విభాగాలలో కొత్త రికార్డులు నెలకొల్పారని చెప్పారు. ముఖ్యంగా 100 మీటర్ల పరుగు పందెంలో రెండు రోజుల వ్యవధిలో పాత రికార్డులను మూడుసార్లు బద్దలుకొట్టిన అనిమేశ్ కుజూర్, గురిందర్‌వీర్ సింగ్‌లతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. వీరిద్దరి పోటీని క్రీడల్లో 'జుగల్‌బందీ'గా అభివర్ణించారు. భారతీయుల శరీరాకృతి స్ప్రింటింగ్‌కు పనికిరాదనే అపోహలను పటాపంచలు చేస్తూ 10.1 సెకన్లలోపు పరుగు పూర్తి చేసిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టించిన నావికాదళ అధికారి గురిందర్‌వీర్‌ను, ఫుట్‌బాల్ నుంచి అథ్లెటిక్స్‌లోకి వచ్చి రాణిస్తున్న అనిమేశ్‌ను ప్రధాని మోదీ అభినందించారు. మైదానం బయట స్నేహితులుగా, మైదానంలో పోటీదారులుగా ఉంటూ దేశ గౌరవాన్ని పెంచుతున్న వీరి క్రీడాస్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. 'మన్ కీ బాత్'లో ప్రధాని ఇంకా ఏం మాట్లాడారంటే...

"దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎండల్లో డీహైడ్రేషన్‌కు గురికాకుండా తగినంత నీరు తాగాలి. బయటకు వెళ్లేటప్పుడు అదనపు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వం జారీ చేసే సలహాలు సూచనలు తప్పనిసరిగా పాటించాలి. వేసవి వేడిని తట్టుకునే అద్భుతమైన మార్గాలు మన వంటగదిలోనే ఉన్నాయి. ఉత్తర భారతదేశపు ఆమ్ పన్నా, పంజాబీ లస్సీ, రాజస్తానీ--గుజరాతీ మజ్జిగలతో పాటు బిహార్, జార్ఖండ్‌ల సత్తు షర్బత్, కొంకణ్ కోకుమ్ షర్బత్, దక్షిణ భారతదేశపు పానకం, నీర్ మోర్ వంటి సాంప్రదాయ పానీయాలు కేవలం దాహాన్ని తీర్చేవి మాత్రమే కావి.. అవి 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయి. ప్రతి ఒక్కరూ ఈ దేశీయ పానీయాలను ఆస్వాదించాలి.

**గ్లోబల్ మార్కెట్‌కు మన మామిడి**

వేసవిలో వచ్చే ఫలరాజం మామిడి పండ్ల ప్రస్తావన రాని ఇల్లు ఉండదు. అల్ఫాన్సో, కేసర్, దశేరీ, లంగ్రా, చౌసా, మాల్డా వంటి మామిడి రకాలు మనకు ఉన్నాయి. ప్రతి పేరుతో ప్రజలకు ఎన్నో జ్ఞాపకాలు ముడిపడి ఉన్నాయి. దక్షిణ భారతదేశానికి వెళితే బంగినపల్లి, తోతాపురీ, నీలం, మాల్గోవా, సువర్ణరేఖ వంటి రకాలు కనిపిస్తాయి. ప్రదేశం మారితే మామిడి పండు ఆకారం, రంగు, రుచీ మారుతాయి. మన మామిడి ప్రయాణం ఇప్పుడు గ్రామాల నుండి గ్లోబల్ మార్కెట్‌కు చేరుకుంటోంది. పడవ ప్రమాదంలో విద్యార్థులు చనిపోయిన ఘటనతో కలత చెంది, కేరళంలో ఉచితంగా 15 వేల మందికి పైగా ఈత నేర్పించిన సాజీ వలాశేరిల్ సేవలు నిజంగా ప్రశంసనీయం. దివ్యాంగ పిల్లలకూ ఈత నేర్పించారు. యూపీ కాలువలో చిక్కుకున్న గంగా డాలి?ఫన్‌ను 13 గంటల పాటు శ్రమించి కాపాడి రాప్తి నదిలోకి విడిచిపెట్టిన సిబ్బందిని అభినందిస్తున్నా.

**గిరిజా అమ్మ దేశభక్తికి సలాం**

తమిళనాడులోని నాగర్‌కోయిల్‌కు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయురాలు గిరిజా అమ్మ గొప్ప దేశభక్తికి ప్రతీక. 'మన్ కీ బాత్' స్ఫూర్తితో ఆమె పనిచేశారు. సైనికుల కోసం రోజుకు ఒక రూపాయి చొప్పున ఏడాదికి రూ.365 విరాళం ఇచ్చేలా తన పరిధిలోని 15 పాఠశాలల విద్యార్థులను ఆమె ప్రోత్సహించారు. అలా సేకరించిన రూ.40 లక్షల చెక్కును ఆమె నాకు అందజేశారు. ఉత్తరప్రదేశ్‌లోని బస్తీ జిల్లాలో మనోరమ నదిని శుభ్రం చేసిన యువకుడు ఆకాశ్ గుప్తా, గోవాలో పైప్‌లైన్లు వేసి నీటి సమస్యను పరిష్కరించిన తీర్చిన రిటైర్డ్ టీచర్ బాలకృష్ణ అయ్యర్ సేవలు అభినందనీయం" అని అన్నారు.



## భక్తిశ్రద్ధలతో శ్రీ మల్లికార్జున స్వామి కేతమ్మల కల్యాణోత్సవం

- ఇంద్రియాల ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు
- ఒగ్గు పూజారుల మంత్రోచ్చారణల మధ్య వేడుకగా క్రతువు
- హాజరైన కాంగ్రెస్ నాయకులు పాక మల్లేష్ యాదవ్, వెంకటేష్ యాదవ్

**భూదాన్ పోచంపల్లి, (తొలివెలుగు ప్రతినిధి కేమ విష్ణు మూర్తి):** మండల పరిధిలోని ఇంద్రియాల గ్రామంలో వెలిసిన శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో మల్లికార్జున స్వామి, కేతమ్మల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. ఒగ్గు పూజారులు తమ సాంప్రదాయ శైలిలో స్వామివారి కల్యాణ క్రతువును కండ్లపండువగా జరిపించారు. భక్తుల జయజయధ్వానాలు, మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ వేడుకను చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కల్యాణోత్సవ వేడుకల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, మాజీ సర్పంచ్ బండి కృష్ణ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని, స్వామివారి కృపాకటాక్షాలు నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు భారీగా మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, అందెల హరీష్ యాదవ్, గ్రామ యాదవ సంఘం నాయకులు పావిరాల మహేందర్, మాజీ ఉపసర్పంచ్ ఉడతల సాయిరాం యాదవ్, ప్రముఖ నాయకుడు బుర్ర రమేష్ రెడ్డి, యాదవ సంఘం ప్రతినిధులు బోయిన రాజు, పావిరాల మల్లేష్, శెట్టి శివాజీ, ఉడతల వాసుదేవ్, పావిరాల శ్రీశైలం, మాకోలు బాలయ్య, పట్నం గణేష్, బోయిన లింగం, మాకోలు రాజశేఖర్, పట్నం శ్రీనివాస్, కనుముని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట రోడ్డు విస్తరణకు గ్రీన్ సిగ్నల్!

- సర్పంచ్ వినతిపై స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- త్వరలోనే ఇబ్బందులు తొలిగిపోతాయని హామీ



**తొలివెలుగు, రామన్నపేట:** మండల కేంద్రం గుండా వెళ్లే ప్రధాన రహదారి విస్తరణకు త్వరలోనే మోక్షం లభించనుంది. యాదాద్రి భువనగిరి జిల్లా లక్ష్మాపురం గ్రామంలోని ఒక వివాహ వేడుకకు వెళ్తున్న రాష్ట్ర ఆర్అండ్బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి రామన్నపేటలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలో రామన్నపేట గ్రామ సర్పంచ్ గరిక సత్యనారాయణ మంత్రిని కలిసి ఇక్కడి రోడ్డు వెడల్పు విస్తరణ ఆవశ్యకతను వివరించారు. ?మండల కేంద్రంలో వాహనాల రద్దీ పెరిగిపోవడంతో రోడ్డు ఇరుకుగా మారి ప్రజలు, వాహనదారులు నిత్యం నరకం చూస్తున్నారని సర్పంచ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేసి, రహదారిని ఆధునికీకరించాలని వేడుకున్నారు. సర్పంచ్ విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి కోమటిరెడ్డి.. రామన్నపేట రోడ్డు సమస్య తన దృష్టికి వచ్చిందని, దీనిపై తక్షణమే సమీక్ష జరిపి అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. తమ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించినందుకు సర్పంచ్ గరిక సత్యనారాయణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## భారీగా ఈఈల బదిలీలు

ట్రై కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ) పరిధిలో భారీ ఎత్తున పలువురు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల (ఈఈ)ల బదిలీలు జరిగాయి. డి. ఆశలత జీహెచ్ ఎంసీ ఈఈ నుంచి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఈఈగా బదిలీ అయ్యారు. కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి మహమ్మద్ వహాజుద్దీన్ జీహెచ్ఎంసీకి బదిలీ అయ్యారు. కె. వరలక్ష్మి జీహెచ్ఎంసీ నుంచి 'టఫిడో' కు బదిలీ అయ్యారు. ఎస్. శ్రీనివాస్, ఆర్. ఇందిరా బాయ్, ఆర్. శ్రీనివాస్ రెడ్డి, సంపద ఈ నలుగురు జీహెచ్ఎంసీ ఈఈలను మలాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. మలాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఆర్. లక్ష్మణ్ జీహెచ్ఎంసీకి బదిలీ అయ్యారు. సి. శ్రీకాంతి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి జీహెచ్ఎంసీకి బదిలీ అయ్యారు. ఎం. ప్రవీణ్ కుమార్ బి. రాములు నల్గొండ మున్సిపాలిటీ నుంచి జీహెచ్ఎంసీకి బదిలీ అయ్యారు.ఆర్. యాదగిరి జీహెచ్ఎంసీ నుంచి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఆర్. శివానంద్ పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్న ఈయనను జీహెచ్ఎంసీకి కేటాయించారు. బి.వి.ఎస్. పేర్రాజు నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఈఈ కార్యాలయం నుంచి జీహెచ్ఎంసీకి బదిలీ అయ్యారు.

# మునుగోడులో గులాబీ జోరు.. కాంగ్రెస్‌కు భారీ షాక్!





- మునుగోడు అభివృద్ధి, ప్రజల ఆరోగ్యమే లక్ష్యం: కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి
- చౌటుప్పల్ 100 పడకల ఆసుపత్రి పనుల పరిశీలన.. ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- ఎల్లంబావి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల సమస్యలపై ఆందోళన
- బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరిన దండు మల్కాపురం కాంగ్రెస్, యువజన నాయకులు

**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రాంత ప్రజల ఆరోగ్యంతో ప్రభుత్వం చెలగాటమాడటం తగదని, చౌటుప్పల్‌లో నిలిచిపోయిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి చౌటుప్పల్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి పనులను, ఎల్లంబావి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం దండు మల్కాపురం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, యువజన నాయకులను బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు.

**ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడొద్దు: 100 పడకల ఆసుపత్రి పరిశీలన**

చౌటుప్పల్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను పరిశీలించిన కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, కాంట్రాక్టర్లు, సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుల సహకారంతో ఈ ఆధునిక ఆసుపత్రిని మంజూరు చేయించి, కేవలం ఏడాది వ్యవధిలోనే 60 శాతం పనులు పూర్తి చేయించామని గుర్తు చేశారు.దఅయితే, గత రెండున్నర సంవత్సరాలుగా అధికారంలో ఉన్న ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే మిగిలిన 40 శాతం పనులను పూర్తి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం వల్లే పనులు నిలిచిపోయాయని, స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాకపోవడం బాధాకరమన్నారు. రాజకీయ నిర్లక్ష్యాన్ని వీడి, వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేసి, నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.

**ఐదు రోజుల్లో ధాన్యం కొనకపోతే జాతీయ రహదారి దిగ్బంధం!**

చౌటుప్పల్ మండలం ఎల్లంబావి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కూసుకుంట్ల, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియ మందగించడం వల్ల రైతులు రోజుల తరబడి కేంద్రాల వద్దే పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో తూకం, రవాణా ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో చర్చించారు. ఐదు రోజుల్లోపు ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి జాతీయ రహదారిపై భారీ ఆందోళన చేపడుతామని అధికారులను హెచ్చరించారు.

**స్థానిక ఎమ్మెల్యేకు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు - సూచనలు:**

స్థానిక ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆయనకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. జన్మ సార్థకం కావాలంటే నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా ముందుకు సాగాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి, ముఖ్యంగా చౌటుప్పల్ ఆసుపత్రి పనుల పూర్తికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని హితవు పలికారు.

**బీఆర్ఎస్ పార్టీలోకి భారీ వలసలు:**

తెలంగాణ అభివృద్ధి, యువత, రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై మునుగోడు నియోజకవర్గంలో పార్టీలోకి వలసలు జోరందుకున్నాయి. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, మాజీ వార్డు సభ్యుడు ఈడుదుల విజయ్ కుమార్ యాదవ్‌తో పాటు దాదాపు 30 మందికి పైగా యువజన నాయకులు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు.

**పార్టీలో చేరిన నాయకులు:**

మాసిన కిష్టయ్య, పగిళ్ల నరేష్, రాచర్ల సందీప్, మాసిన మల్లికార్జున్, గొలుసుల గిరి, మాసిన శ్రీశైలం, బసిరెడ్డి మల్లారెడ్డి, మాసిన రమేష్, చింతపట్ల రాజశేఖర్, రాసాల మహేష్, వాడపల్లి వజ్రేష్, గొలుసుల శివ, గొలుసుల శ్రీశైలం, పగిళ్ల ఉపేందర్, పగిళ్ల మహేందర్, దాకోజు వంశీ, దాకోజు శశి, దాకోజు సుశాంత్, సింగనమని బన్నీ, గోపి వంశీ, గోపి మధు, గోలి శివమణి, ఈడుదుల వంశీ, రుద్రారం శివ, చిట్టంపల్లి జగన్ తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు, దండు మల్కాపురం గ్రామ సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ.. దండు మల్కాపురం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతం అవుతోందని, రానున్న రోజుల్లో అందరం కలిసికట్టుగా పనిచేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, కౌన్సిలర్ కొయ్యడ శేఖర్ గౌడ్, ఢిల్లీ మాధవరెడ్డి, మాజీ కౌన్సిలర్ తాడూరి శిరీష - పరమేష్, కొత్త మహేష్, చిట్టంపల్లి సాయికుమార్, సంఘం నరసమ్మ-చంద్రయ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






# కాంగ్రెస్ నేత ఇంట్లో వేడుక.. విచ్చేసిన మంత్రి వెంకటరెడ్డి

- బత్తుల నవీన్ కుమార్ కుమార్తె ఉయ్యాల మహోత్సవానికి హాజరు
- చిన్నారిని ఆశీర్వదించిన మంత్రి.. తరలివచ్చిన పార్టీ శ్రేణులు, కోమటిరెడ్డి

**తొలివెలుగు, రామన్నపేట:** మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బత్తుల నవీన్ కుమార్ - జ్యోతి దంపతుల కుమార్తె డోలారోహణ (ఉయ్యాల) మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. మంత్రి గ్రామానికి చేరుకోగానే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. పూర్ణకుంభంతో స్వాగతించి శాలువాతో సత్కరించారు. అనంతరం వేడుకలో పాల్గొన్న మంత్రి, ఉయ్యాలలో ఉన్న చిన్నారికి అక్షింతలు వేసి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఎదగాలని ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించి వారి క్షేమసమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. మంత్రి రాకతో లక్ష్మాపురం గ్రామంలో కాంగ్రెస్ శ్రేణులు, కోమటిరెడ్డి అభిమానులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. "కోమటిరెడ్డి జిందాబాద్" అంటూ నినాదాలు చేస్తూ ఉత్సాహం వ్యక్తం చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, స్థానిక ప్రజలు కూడా అధిక సంఖ్యలో పాల్గొని వేడుకను తిలకించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి మల్లారెడ్డి, రామన్నపేట సర్పంచ్ గరిక సత్యనారాయణ, సీనియర్ నాయకులు గంగుల రాజిరెడ్డి, గుత్త నర్సిరెడ్డి, నంద్యాల భిక్షం రెడ్డి, శంభాల వెంకన్న, జమీర్, అక్రం, లక్ష్మాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, బత్తుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.దరాష్ట్ర మంత్రే స్వయంగా ఇంటికి విచ్చేసి చిన్నారిని ఆశీర్వదించడం తమ కుటుంబానికి మరపురాని ఘట్టమని బత్తుల నవీన్ కుమార్ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమం అనంతరం అతిథులకు విందు ఏర్పాటు చేసి ఆతిథ్యం అందించారు.







## నిజమైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి

- కేకే కమిటీకి నివేదిక అందజేస్తాం: ఎస్కే చాంద్
- బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఉద్యమకారుల ఫోరం ప్రతినిధుల సమావేశం

**రామన్నపేట/ హైదరాబాద్,తొలివెలుగు:** రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కేకే (కోదండరాం) కమిటీ నిఖార్సైన, నిజమైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్కే చాంద్ కోరారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఉద్యమకారుల ఫోరం ప్రతినిధుల రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని, లాఠీదెబ్బలు తిని, జైలుకు వెళ్లిన ఎంతోమంది అసలైన ఉద్యమకారులు ఇప్పటికీ ఎలాంటి గుర్తింపునకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రామన్నపేట మండల వ్యాప్తంగా ఉన్న నిజమైన ఉద్యమకారుల వివరాలను ఉద్యమకారుల ఫోరం తరపున పూర్తిస్థాయిలో సేకరిస్తున్నామని తెలిపారు. ఆ జాబితాను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేకే కమిటీకి నివేదిక రూపంలో అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉద్యమకారుల ఫోరం రామన్నపేట మండల అధ్యక్షుడు నోముల శంకర్, ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి లింగయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి ఇమామ్, రాష్ట్ర నాయకుడు గడ్డం యాదగిరి, మండల నాయకులు కొండ మల్లేష్, కైరం కొండ సంతోష్, మధ్యగల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## పాతికేళ్ల జ్ఞాపకాలు.. ఒకే చోట కలిసిన బాల్య మిత్రులు!

- పాఠశాల రోజులను గుర్తుచేసుకున్న 1998-99 ఏడో తరగతి బ్యాచ్
- లక్ష్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో పూర్వ విద్యార్థుల సందడి
- గురువులకు పాదాభివందనం చేసి సత్కరించిన వైనం




**తొలివెలుగు, రామన్నపేట:** మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) ఆవరణ ఆదివారం నాటి మధుర స్మృతులకు వేదికైంది. పాఠశాలలో 1998-99 విద్యాసంవత్సరానికి చెందిన ఏడో తరగతి పూర్వ విద్యార్థులు దశాబ్దాల తర్వాత ఒకేచోటికి చేరి ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్ననాటి మిత్రులంతా ఒకరినొకరు కలుసుకుని, అలనాటి చదువులు, నాడు ఆడుకున్న ఆటపాటలు, తిరిగిన వీధుల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు క్రమశిక్షణతో కూడిన విద్యాబుద్ధులు నేర్పించి, నేటి సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన నాటి ఉపాధ్యాయులు వెంకటేశ్వర్, ఆంజనేయులులను విద్యార్థులు భక్తిశ్రద్ధలతో గుర్తుచేసుకున్నారు. వారిని వేదికపైకి ఆహ్వానించి శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి, పాదాభివందనం చేశారు. గురువుల ఆశీస్సులు ఎప్పటికీ తమకు మార్గదర్శకాలని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ అపురూప వేడుకలో పూర్వ విద్యార్థులు కాటమరాజు, బత్తిని ఆంజనేయులు, ముక్కాముల స్వామి యాదవ్, బొడిగె ఆంజనేయులు, చెరుకు మురళి, జె. కుమార్, వరలక్ష్మి, శోభ, లక్ష్మి, ధనమ్మలతో పాటు పలువురు సహచర విద్యార్థులు పాల్గొని సందడి చేశారు.

## దుర్గామాత ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

- అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన విప్
- ఆలయ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘన స్వాగతం

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని చల్లూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన దుర్గామాత ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ప్రభుత్వ విప్, ఆలేరు నియోజకవర్గ శాసనసభ్యులు బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి విచ్చేసిన ఆయనకు ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు సాంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య దుర్గామాత అమ్మవారి ఆలయంతో పాటు గ్రామ దేవతల ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం గ్రామ సర్పంచ్ భీమగాని రూప బాలనరసయ్య దంపతులు, ఉపసర్పంచ్ బొంత సుధాకర్, జాతర నిర్వాహక కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా కార్యదర్శి, సోషల్ మీడియా కన్వీనర్ ఇంజ నరేష్, దిడిగ రమేష్, చల్లూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



# బడి తెరిచే రోజే యూనిఫాంల పంపిణీ

- రాజాపేట మండలంలో 2,664 మంది విద్యార్థులకు లబ్ధి
- ఈ విద్యాసంవత్సరం నుంచే షూస్, బెల్టుల అందజేత
- నాణ్యత పరిశీలన తర్వాతే పంపిణీ చేయాలని నిబంధన




**తొలివెలుగు, రాజాపేట:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం ప్రారంభం రోజే దుస్తులు, ఇతర వస్తువులను అందించేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే మొదటి రోజే విద్యార్థులకు యూనిఫాం, షూస్, బెల్టులు అందించేలా ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలను విధించింది. రాజాపేట మండలంలో మొత్తం 39 ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 2,664 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికీ రెండు జతల చొప్పున మొత్తం 5,328 యూనిఫాంలను సిద్ధం చేయాల్సి ఉంది. ఈ దుస్తుల కుట్టుబాట్లను ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల (ఐకేపీ) మహిళలకు అప్పగించింది. జూన్ 12న బడి తెరిచే నాటికి మొదటి జత యూనిఫాంను, జూన్ నెలాఖరులోగా రెండో జతను పంపిణీ చేయాలని ప్రభుత్వం స్పష్టమైన గడువును నిర్దేశించింది. గతంలో యూనిఫాంల పంపిణీలో జరిగిన ఆలస్యం, నాసిరకం కుట్టు, సైజుల సమస్యలపై తీవ్ర విమర్శలు వచ్చిన నేపథ్యంలో ఈసారి విద్యాశాఖ ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. ప్రతి మండలంలో ఎంఈఓ (మండల విద్యాధికారి) ఆధ్వర్యంలో ఈ కమిటీలు పనిచేస్తాయి. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎంలు) స్వయంగా దుస్తుల సైజు, కుట్టు నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఎక్కడైనా లోపాలు గుర్తిస్తే సదరు ఏజెన్సీలు 48 గంటల్లోగా వాటిని మార్చి ఇవ్వాలని ఆదేశించారు. ఫిర్యాదుల నమోదు కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు పాలు, రాగిజావ అందించేందుకు ముందస్తు చర్యలు చేపట్టారు. నాణ్యత లేని వస్తువులను సరఫరా చేసే ఏజెన్సీలను ఉపేక్షించబోమని, వారిని బ్లాక్ లిస్ట్‌లో పెడతామని ప్రభుత్వం హెచ్చరించింది.






## కాల్వపల్లి అంజన్న ఆలయంలో 'పౌర్ణమి' పూజలు!

- శాస్త్రోక్తంగా మహాగణపతి సహిత గాయత్రీ మార్కండేయ హవనం
- పద్మబ్రాహ్మణుల ఆధ్వర్యంలో హోమ క్రతువు

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని కాల్వపల్లి గ్రామంలో అధిక జ్యేష్ఠ మాస పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక హోమ క్రతువును అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో పద్మబ్రాహ్మణుల ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం సాగింది. ఆలయ అర్చకులు పెంట సత్యనారాయణ వేదమంత్రాల నడుమ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఉత్సవాల్లో భాగంగా ముందుగా శ్రీ మహాగణపతి సహిత గాయత్రీ మార్కండేయ హవనం, కలశ ఆరాధన, మహాగణపతి పూజలను వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీ ఆంజనేయ స్వామి వారికి షోడశోపచార అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు శ్రీ మహాగణపతి, గాయత్రీ మార్కండేయ, శ్రీ ఆంజనేయ గాయత్రీ హోమాలను సంప్రదాయబద్ధంగా పూర్తి చేశారు. ఇందులో భాగంగా లోకకల్యాణార్థం మృత్యుంజయ, లక్ష్మీనృసింహ, రుద్ర, గాయత్రీ మంత్రాలతో పూర్ణాహుతి హోమం గావించారు. ఈ కార్యక్రమాన్ని పద్మబ్రాహ్మణుల ప్రముఖులు చెడిదీపు కృష్ణ, పెంట సత్యనారాయణ, రేగొండ పాండురంగం, సాంబారపు కృష్ణలు పర్యవేక్షించారు. కార్యక్రమంలో భక్తులు జన్నెపల్లి సవితమ్మ, బల్ల బాలయ్య, మజ్జిగ బాలయ్యలతో పాటు గ్రామస్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## రఘునాథపురం ప్రభుత్వ బడి విద్యార్థుల ఘనత

- బాసర ట్రిపుల్ ఐటీకి ఐదుగురు ఎంపిక
- జిల్లా స్థాయిలోనే ప్రత్యేక గుర్తింపు సాధించిన పాఠశాల
- అభినందించిన జిల్లా విద్యాధికారి కందుల సత్యనారాయణ



**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని రఘునాథపురం సంగిశెట్టి నరసయ్య మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అకడమిక్ రంగంలో మరొక్కసారి తమ అద్భుత ప్రతిభను చాటుకున్నారు. రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ) 2026 విద్యాసంవత్సరానికి గానూ శనివారం విడుదల చేసిన బాసర ట్రిపుల్ ఐటీ ప్రవేశాల జాబితాలో ఈ పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు సీట్లు సాధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. మనోజ్ కుమార్ ఆదివారం ఈ ఎంపిక వివరాలను అధికారికంగా వెల్లడించారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారిలో కీసర ప్రజ్వల్, శెట్టి భానుశ్రీ, పన్నీరు బిందుమాధవ్, భోగరామ్ తేజ, దొమ్మాటి సిరివెన్నెల ఉన్నారు. ఒకే ప్రభుత్వ పాఠశాల నుండి ఇంతమంది విద్యార్థులు ప్రతిష్టాత్మక ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ అద్భుత ఫలితాల నేపథ్యంలో రాజాపేట మండల విద్యాధికారి (ఎంఈఓ) చందా రమేష్ విలేకరులతో మాట్లాడుతూ.. యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయిలోనే రఘునాథపురం ప్రభుత్వ పాఠశాలకు ఒక ప్రముఖమైన స్థానం ఉందని, ఈ నాణ్యమైన ఫలితాలతో అది మరొకసారి నిరూపితమైందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు కే. మనోజ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే ఉపాధ్యాయులు, విద్యార్థులు పక్కా ప్రణాళికతో, అంకితభావంతో చేసిన కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. ఫలితాల సాధన కోసం శ్రమించిన ఉపాధ్యాయ బృందాన్ని, విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రఘునాథపురం విద్యార్థుల ప్రతిభను జిల్లా విద్యాధికారి (డీఈఓ) కందుల సత్యనారాయణ ఫోన్ ద్వారా ప్రత్యేకంగా అభినందించారు.

# టెండర్లు వేయకపోతే ఉద్యమం ఉద్ధృతం!


- యాదగిరిగుట్టలో పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా
- వర్తక సంఘాన్ని రద్దు చేయాలని డిమాండ్
- తహసీల్దార్ కార్యాలయం నుంచి పాతగుట్ట చౌరస్తా వరకు భారీ ర్యాలీ

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పరిధిలోని దుకాణాలకు తక్షణమే బహిరంగ టెండర్లు నిర్వహించాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని దేవాలయ పరిరక్షణ సమితి హెచ్చరించింది. యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. కొండపైన ప్రస్తుతం ఉన్న వర్తక సంఘాన్ని రద్దు చేసి, అన్ని దుకాణాలకు పారదర్శకంగా టెండర్లు వేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుండి పాతగుట్ట చౌరస్తా వరకు కమిటీ సభ్యులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండ్ ఎదురుగా ప్రధాన రహదారిపై సుమారు గంటపాటు మహాధర్నా చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలకు స్వల్ప అంతరాయం ఏర్పడింది.ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. కొండపైన వర్తక సంఘం గుత్తాధిపత్యాన్ని రద్దు చేసి టెండర్లు నిర్వహించడం ద్వారా దేవస్థానానికి ఏడాదికి రూ.20 కోట్ల నుండి రూ.30 కోట్ల వరకు అదనపు ఆదాయం సమకూరుతుందని విశ్లేషించారు. ఈ నిధులతో క్షేత్రానికి వచ్చే భక్తులకు మరిన్ని మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించవచ్చని, స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కొండపైన ఉన్న 10 తాత్కాలిక దుకాణాల లీజు గడువు మే 31తో ముగిసిందని, ఇప్పటివరకు ఎలాంటి రెన్యువల్ నోటిఫికేషన్ రాకపోవడం గమనార్హమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు వేయకుండా పాతవారికే రెన్యువల్ చేస్తే సహించేది లేదని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాటబత్తిని ఆంజనేయులు, పల్లపు బాలయ్య, బండ రామస్వామి, దేవపూజ అశోక్, గ్యాదపాక బాల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.





# విధుల నిర్వహణలో సీఆర్పీల నిర్లక్ష్యం!




- రాజాపేట మండలంలో అవసరానికి మించి అదనపు పోస్టు
- రికార్డుల తనిఖీ, మధ్యాహ్న భోజన పర్యవేక్షణ గాలికే..
- చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారికి విజ్ఞప్తి

**తొలివెలుగు, రాజాపేట:** మండలంలో విద్యాశాఖకు అనుబంధంగా పనిచేస్తున్న క్లస్టర్ రీసోర్స్ పర్సన్స్ (సీఆర్పీలు) తమకు కేటాయించిన విధులను పూర్తిగా విస్మరిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణను బలోపేతం చేసేందుకు ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థ మండలంలో అసలు లక్ష్యాన్ని పక్కదారి పట్టిస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. సీఆర్పీల మధ్య సమన్వయ లోపం, పర్యవేక్షణా రాహిత్యం కారణంగానే గత విద్యాసంవత్సరంలో మండలంలో ఆశించిన రీతిలో విద్యా ఫలితాలు రాలేదని స్థానికులు, విద్యాప్రేమికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ముగ్గురు సరిపోయే చోట నలుగురు ఎందుకు?**

మండలంలో ప్రస్తుతం ఉన్న పాఠశాలల సంఖ్య, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముగ్గురు సీఆర్పీలు మాత్రమే అవసరం కాగా, ప్రస్తుతం నలుగురు కొనసాగుతుండటం గమనార్హం. ఇక్కడి రెండు క్లస్టర్ల పరిధిలో మొత్తం 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 26 ప్రాథమిక పాఠశాలలతో పాటు 5 ప్రైవేటు పాఠశాలలు నడుస్తున్నాయి. వీటి పరిధిలో నిరంతరం పర్యవేక్షిస్తూ, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని నమోదు చేయడం, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరును పరిశీలించడం, పాఠశాలల రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేయడమే సీఆర్పీల ప్రధాన విధి.

**పర్యవేక్షణ శూన్యం.. ప్రభుత్వ ఆశయాలకు గండి**

అయితే, ఈ కీలకమైన పర్యవేక్షణ బాధ్యతలను సీఆర్పీలు పూర్తిగా గాలికొదిలేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలల్లో క్షేత్రస్థాయిలో ఉన్న లోటుపాట్లను, మౌలిక వసతుల సమస్యలను క్రమబద్ధంగా మండల విద్యాధికారి (ఎంఈఓ) దృష్టికి తీసుకెళ్లడంలో వీరు ఘోరంగా విఫలమవుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఆశయాలు నెరవేరడం లేదు. అవసరానికి మించి ఒక అదనపు పోస్టు ఇక్కడ ఉండటం కూడా బాధ్యతారాహిత్యానికి, ఇక్కడి విద్యావ్యవస్థ తిరోగమనానికి ప్రధాన మైనస్‌గా మారిందని పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

**ఈ ఏడాది నుంచైనా ప్రక్షాళన జరిగేనా?**

ప్రస్తుత విద్యాసంవత్సరం (2026-27) ప్రారంభం నుండైనా సీఆర్పీలు తమ విధులను సక్రమంగా, జవాబుదారీతనంతో నిర్వర్తించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, రాజాపేట మండలంలో అదనంగా ఉన్న సదరు సీఆర్పీ పోస్టును రద్దు చేసి, సిబ్బంది కొరతతో ఇబ్బంది పడుతున్న ఇతర మండలాలకు డిప్యూటేషన్‌పై బదిలీ చేయాలని జిల్లా విద్యాధికారి (డీఈఓ) కి విజ్ఞప్తి చేస్తున్నారు.

## రాజాపేట మండలంలో పంచాయతీ కార్యదర్శుల బదిలీ

- మండల పరిషత్ సిబ్బంది కూడా వేరే చోట్లకు మార్పు
- వివరాలు వెల్లడించిన ఎంపీడీవో నాగవేణి

**తొలివెలుగు, రాజాపేట:** మండలంలో పలువురు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఇందుకు సంబంధించిన బదిలీల వివరాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) నాగవేణి ఆదివారం విలేకరులకు వెల్లడించారు. మండలంలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న వారితో పాటు పరిపాలనా పరమైన కారణాల దృష్ట్యా ఈ బదిలీలు జరిగినట్లు ఆమె పేర్కొన్నారు.

**ఇతర మండలాలకు బదిలీ అయిన వారు:**

మండలంలోని జాల పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న గుజ్జ ఉమేష్ తుర్కపల్లి మండలం పెద్దతండ గ్రామానికి బదిలీ కాగా, పారుపల్లి కార్యదర్శి కమటం సంపత్ యాదగిరిగుట్ట మండలం మర్రిగూడెం గ్రామానికి బదిలీ అయ్యారు. అలాగే కొండ్రెడ్డి చెరువు కార్యదర్శి కమటం సిద్ధేశ్వర్ యాదగిరిగుట్ట మండలం చొల్లేరు గ్రామానికి బదిలీపై వెళ్లారు.

**మండల పరిధిలోనే అంతర్గత బదిలీలు:**

రాజాపేట మండల పరిధిలోనే ఐదుగురు కార్యదర్శులు ఇతర గ్రామ పంచాయతీలకు బదిలీ అయ్యారు. దూడల స్వర్ణ లక్ష్మక్కపల్లి నుండి పారుపల్లికి, నారెడ్డి రాజమహేందర్ రెడ్డి సింగారం నుండి రాజాపేట స్థానానికి బదిలీ అయ్యారు. భూమండ్ల మమత కొత్తజాల నుండి పాముకుంటకు, బొచ్చు జ్యోతి బూరుగుపల్లి నుండి లక్ష్మక్కపల్లి గ్రామ పంచాయతీకి బదిలీ కాగా, రఘునాథపురం కార్యదర్శి (ఓపీఎస్) పాషికంటి పవన్ కుమార్ పుట్టగూడెం గ్రామ పంచాయతీకి బదిలీ అయ్యారు.

**కార్యాలయ సిబ్బంది మార్పు:**

మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించిన ఖలీల్ అహ్మద్ జనగామ జిల్లా కొడకండ్ల మండల పరిషత్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. కార్యాలయ అటెండర్ ఎం. కవిత ఆలేరు మండల పరిషత్ కార్యాలయానికి, నైట్ వాచ్‌మెన్ శైలజ రామన్నపేట ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారని ఎంపీడీవో వివరించారు.

## జ్ఞాపకాల పందిరిలో.. నాటి స్నేహాలు!

- నమిల ఉన్నత పాఠశాలలో 2005-06 ఎస్ఎస్‌సీ బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం
- రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్న సహాధ్యాయులు
- గురువులను ఘనంగా సన్మానించి ఆశీస్సులు పొందిన పూర్వ విద్యార్థులు

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని నమిల ఉన్నత పాఠశాల ప్రాంగణం ఆదివారం నాస్టాల్జియా (గత స్మృతుల) వేదికగా మారింది. ఒకప్పుడు ఇదే పాఠశాలలో అక్షరాలు దిద్ది, క్రమశిక్షణ నేర్చుకుని, నేడు సమాజంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన 2005-06 విద్యాసంవత్సరానికి చెందిన ఎస్ఎస్సి పూర్వ విద్యార్థులంతా ఒకే చోట చేరి 'ఆత్మీయ సమ్మేళనం' నిర్వహించుకున్నారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత బాల్య స్నేహితులంతా ఒకరినొకరు కలుసుకోవడంతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. ఆదివారం ఉదయం 10 గంటలకే వివిధ ప్రాంతాల నుండి విద్యార్థులు పాఠశాల ప్రాంగణానికి చేరుకున్నారు. ఒకరినొకరు కౌగిలించుకుని, కుశలప్రశ్నలు వేసుకుంటూ నాటి బాల్య స్మృతులను, క్లాస్‌రూమ్ ముచ్చట్లను గుర్తుచేసుకున్నారు.

**గురుదేవోభవ...**

ఈ వేడుకలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను విద్యార్థులు భక్తిశ్రద్ధలతో ఆహ్వానించారు. వారి పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం గురువులను ప్రత్యేకంగా శాలువాలతో కప్పి, జ్ఞాపికలను బహూకరించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ... తాము ఈరోజు ఈ స్థాయిలో ఉన్నామంటే దానికి నమిల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వేసిన బలమైన పునాదే కారణమని, ఇక్కడ చదువుకోవడం తమ పూర్వజన్మ సుకృతమని కొనియాడారు. చదువుతో పాటు సమాజంలో ఎలా బతకాలో నేర్పిన గురువుల రుణం తీర్చుకోలేనిదని భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. సమ్మేళన జ్ఞాపకార్థం పాల్గొన్న విద్యార్థులందరికీ నిర్వాహకులు ప్రత్యేక షీల్డులను పంపిణీ చేశారు.




# దొంగలు దొరికేనా..?

హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వినయ్‌రంజన్ భార్య హత్య, దోపిడీ కేసులో పనిమనిషి కల్పన నేతృత్వంలోని నేపాలీ ముఠా దేశం దాటి నేపాల్‌లోకి పారిపోయినట్లు పోలీసులు నిర్ధారించారు. నిం దితుల కోసం రంగంలోకి దిగిన పది పోలీసు బృందాలు భారత్-నేపాల్ సరిహద్దుతో పాటు పుణె, ముంబై, ఢిల్లీ, యూపీ, బీహార్, మధ్యప్రదేశ్‌లో పలుచోట్ల ముమ్మరంగా గాలించారు. వినయ్‌రంజన్‌రాయ్ ఇంట్లో పనిచేసిన కల్పన రచించిన ప్రణాళికతోనే ఏడుగురు సభ్యుల ముఠా ఈ దోపిడీకి పాల్పడిందని, అయితే కల్ప న మాత్రం పోలీసుల కళు ్లగప్పి సరిహద్దు నుంచి రహస్యమార్గాల ద్వారా నేపాల్‌కు చేరినట్లు తెలిసినట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. ఈకేసులో కల్పనకు సహకరించిన ఒక్కరు మాత్రమే పోలీసులకు పట్టుబడగా మిగతావారంతా దాదాపు నేపాల్‌కు చేరిఉంటారని సజ్జనార్ తెలిపారు. కల్పన ముఠాను పట్టుకునేందుకు ఆపరేషన్ నేపాల్ పేరుతో ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపామని, త్వరలోనే ఓ పోలీసు బృందాన్ని నేపాల్‌కు పంపుతున్నామని సజ్జనార్ తెలిపారు.

**ఏడాదిలో ఆరు దోపిడీలు..**

ఒక్క ఏడాదిలోనే దాదాపు 6 దోపిడీలకు పాల్పడిన నేపాలీ దొంగల వ్యవహారం నగరవాసులకు ప్రత్యేకించి పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటివరకు జరిగిన ఘటనల్లో ఒకట్రెండు మినహాయిస్తే మిగతావాటిలో అసలు సూత్రధారులు ఇప్పటికీ దొరకలేదని పోలీసులే చెబుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 45లో ఓ వ్యాపారి ఇంట్లో తోటమాలిగా చేసిన భార్యాభర్తలు.. యజమానులు వేరే ప్రదేశానికి వెళ్లిన సమయంలో ఆరుగురు ముఠా సభ్యులతో కలిసి ఇంట్లోని రూ. 2కోట్లు చోరీ చేసి పరారయ్యారు. వారిని నేపాల్‌లో పట్టుకున్న హైదరాబాద్ పోలీసులు వారిని అక్కడే వదిలేసి వచ్చినట్లు తెలిసింది.

గత సంవత్సరం మే నెలలో కాచిగూడ పరిధిలోని ఓ పారిశ్రామిక వేత్త ఇంట్లో భారీ చోరీకి పాల్పడిన నేపాలీ ముఠా రూ. 1. 5కోట్ల సొమ్ముతో ఉడాయించింది. ఇంటి యజమానులకు భోజనంలో మత్తు మందు కలిపి, ఇంట్లో ఉన్న బంగారం, వజ్రాలు, వెండి, నగదుతో సహా పరారయ్యారు. వీరిని పట్టుకోవడానికి ప్రత్యేక పోలీసు బృందాలు, దొంగలకంటే ముందే విమానంలో ఢిల్లీ, నేపాల్ సరిహద్దుల్లోకి చేరకున్నప్పటికీ దొంగలు మాత్రం దొరకలేదు. వీరు రహస్య మార్గాల ద్వారా నేపాల్‌కు చేరుకుని ఉంటారని భావించిన సీపీ.. దొంగల ముఠా నేపాల్‌లోని కైలాలీ జిల్లాకు చెందినవారుగా గుర్తించి ఆపరేషన్ కైలాలీ పేరుతో ఒక ప్రత్యేక బృందాన్ని ఆ దేశానికి పంపారు. అక్కడ వారి చిరునామాలలో గాలించినప్పటికీ వారు భారత్ దాటి నేపాల్‌కు వెళ్లలేదని తెలిసింది. అయితే వారు భారత్‌లో ఎక్కడ దాచుకున్నారనేది ఇప్పటికీ తేలలేదు. చేసేది లేక నేపాల్ దొంగల ముఠాకు చెందిన అనుమానిత ఫోటోలను విడుదల చేసిన పోలీసులు, ఇండియా-నేపాల్ సరిహద్దుల్లో లుక్అవుట్ నోటీసులు జారీచేశారు. దొంగల ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలంటూ డీసీపీ, ఏసీపీ, ఎస్‌హెచ్‌ఓ, డీఐ నంబర్లతో పోస్టర్ విడుదల చేశారు. నేపాలీ దొంగలను పట్టుకునేందుకు హైదరాబాద్ పోలీసులు ఆపరేషన్ నేపాల్ పేరుతో గతంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఆ సమయంలో దొరికిన కొందరిని విచారిస్తే సంచలన విషయాలు వెలుగుచూశాయి. గత కొన్నేళ్లుగా దేశంలో వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న నేపాలీలు దొంగతనాలు ఎలా చేస్తున్నారు. ఎలాంటి వ్యూహం అమలు చేస్తున్నారంటూ ఆరా తీయగా ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. ఈ ముఠా సభ్యులంతా ఒకేచోట ఉండరు. హైదరాబాద్, బెంగళూరు, ముంబై తదితర నగరాల్లో ఒక్కొక్కరు ఇంటి పనికి చేరతారు. ఎక్కడ గిట్టుబాటు అవుతుందో తెలిసిన తర్వాత అందరూ అక్కడికి చేరుకొని పక్కాప్లాన్ ప్రకారం సొత్తుతో ఉడాయిస్తారు. ఎక్కువగా నేపాల్ నుంచి తెచ్చిన మత్తుమందు వాడటం, లేదా ఇంటి యజమానులు లేని సమయాలు చూసి దోపిడీ చేస్తారని పోలీసుల విచారణలో తేలింది.



## నిరుపేద కుటుంబాలకు బీర్ల ఫౌండేషన్ ఆసరా

- నమిల గ్రామంలో 50 కేజీల చొప్పున బియ్యం పంపిణీ
- బాధిత కుటుంబానికి రూ.3 వేల ఆర్థిక సహాయం చేసిన సర్పంచ్

**తొలివెలుగు, రాజాపేట:** నిరుపేద కుటుంబాలను ఆదుకునేందుకు బీర్ల ఫౌండేషన్ నిరంతరం ముందంజలో ఉంటుందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. రాజాపేట మండల పరిధిలోని నమిల గ్రామంలో ఆదివారం బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన ఉట్కూరి మహేష్, పండుగ అండమ్మ, జెట్ట మల్లమ్మల కుటుంబాల ఆర్థిక పరిస్థితిని గమనించిన ఫౌండేషన్ నిర్వాహకులు.. వారికి మానవతా దృక్పథంతో సాయం అందించారు. ఈ మేరకు ఆయా కుటుంబాలకు 50 కేజీల చొప్పున నాణ్యమైన బియ్యాన్ని అందజేశారు. దీనితో పాటుగా, ఉట్కూరి మహేష్ కుటుంబ పరిస్థితిని చూసి చలించిన స్థానిక సర్పంచ్ పులి రాజు తన సొంత నిధుల నుండి రూ. 3,000ల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేసి అండగా నిలిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సమాజంలో ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవడానికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు, కొలిపాక మల్లేష్, జెట్ట సిద్దులు, బత్తిని సుధాకర్, పోచంగల్ల సుధాకర్, పోచంగల్ల చంద్రయ్య, వేముల జమాల్, సీర బాల మల్లయ్య, గవ్వల నరసింహులు, నీల కనకయ్య, పిడిశెట్టి మహేందర్, డొంకన లోకేష్, కొలిపాక యాదగిరి తదితరులు పాల్గొన్నారు. పేదల సాయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## మృతుడి కుటుంబానికి సర్పంచ్ ఆర్థిక సాయం

- కుర్రారంలో చిట్యాల బాల నర్సయ్య కుటుంబానికి పరామర్శ
- రూ.5 వేల నగదు అందజేసిన సర్పంచ్ బొడ్డు భాస్కర్



**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని కుర్రారం గ్రామానికి చెందిన చిట్యాల బాల నర్సయ్య (అనారోగ్యంతో) ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుర్రారం గ్రామ సర్పంచ్ బొడ్డు భాస్కర్ ఆదివారం బాధిత కుటుంబాన్ని వారి నివాసంలో పరామర్శించారు. బాల నర్సయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. కుటుంబ అత్యవసర ఖర్చుల నిమిత్తం సర్పంచ్ బొడ్డు భాస్కర్ తన సొంత నిధుల నుండి రూ. 5,000ల తక్షణ ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబానికి చెందిన బాల నర్సయ్య మృతి చెందడం బాధాకరమని, వారి కుటుంబానికి గ్రామం తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు జన్నే బాలరాజు, పాండవుల లింగయ్య, చిట్యాల బిక్షపతి, పెంటపర్తి రవీందర్ రెడ్డి, ఎర్రగుంట కిషన్, చిట్యాల రామయ్య, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే నా ప్రథమ కర్తవ్యం

- వలిగొండ రహదారి పునర్నిర్మాణ పనుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్
- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో శాశ్వత పరిష్కారం

**తొలివెలుగు, చౌటుప్పల్:** మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల ఇబ్బందులను తొలగించి, మౌలిక వసతులు కల్పించడమే తమ పాలకమండలి ముఖ్య లక్ష్యమని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. గత కొంతకాలంగా తీవ్రంగా దెబ్బతిని, గుంతలమయంగా మారిన వలిగొండ రోడ్డు పునర్నిర్మాణ పనులను ఆమె ఆదివారం పరిశీలించారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో వలిగొండ రహదారిలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి కోర్టుకు వెళ్లే దారి వరకు రోడ్డు నిర్మాణ పనులను ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ... గతంలో ఈ బీటీ రోడ్డుకు రెండుసార్లు మరమ్మతులు చేపట్టినప్పటికీ, భారీ వాహనాల రాకపోకలు మితిమీరడం వల్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమై వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. ఈ సమస్యను ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. రాబోయే 15 రోజుల్లో రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్‌తో మాట్లాడి, ఎమ్మెల్యే సహకారంతో ఈ వలిగొండ రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. రోడ్డు పనులు ప్రారంభం కావడంపై వాహనదారులు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



సోమవారం
01-6-2026
Telangana
జనరల్ న్యూస్
జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..


# భర్త కండ్ల ముందే భార్య దారుణ హత్య

- పొదల్లోకి లాకెళ్లి గొంతు కోసి చంపిన దుండగులు
- అడ్డుకోబోయిన భర్తపై దాడి ఐడీఏ బొల్లారంలో ఘటన

**బొల్లారం, మే 31:** ఏడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. భర్త కండ్లముందే కొందరు గుర్తు తెలియని దుండగులు అతడి భార్యను బలవంతంగా లాకెళ్లి గొంతు కోసి కిరాతకంగా హత్య చేయడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బొల్లారం సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బీహార్ రాష్ట్రానికి చెందిన అనిల్ కుమార్, మీనా దేవి (35) దంపతులు బతుకు తెరువు కోసం బొల్లారం పారిశ్రామిక వాడకు వలస వచ్చి స్థానిక వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి దంపతులిద్దరూ సమీపంలోని వారాంతపు సంతకు వెళ్లారు.

**రాత్రి తమ బైక్ పై తిరిగి ఇంటికి వస్తున్నారు. వారి బైక్ ...**

గండిగూడెం క్రీడా ప్రాంగణం సమీపానికి రాగానే ఆగిపోయింది. బైక్‌ను పరిశీలిస్తున్న సమయంలో రోడ్డు పకనే ఉన్న చెట్ల పొదల్లోంచి కొందరు దుండగులు ఒకసారిగా వారిపై దాడి చేశారు. మొదట భర్త అనిల్ కుమార్‌ను చితకబాదిన దుండగులు, ఆ తర్వాత మీనాదేవిని పొదల్లోకి లాకెళ్లారు. అనిల్ కుమార్ వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, అతడిపై కత్తులతో విచక్షణారహితంగా దాడి చేశారు. అనంతరం దుండగులు మీనాదేవి గొంతు కోసి అత్యంత కిరాతకంగా హత్య చేసి అకడి నుంచి పారిపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

# నకిలీ జీవోల కేసులో మరో ఇద్దరి అరెస్ట్

**రూ.12 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తింపు**

గండిపేట గ్రామంలోని విలువైన ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు, తప్పుడు అధికారిక రికార్డులు సృష్టించి భారీ కుట్రకు పాల్పడిన కేసులో నార్సింగి పోలీసులు మరో ఇద్దరు కీలక నిందితులను అరెస్ట్ చేశారు. ఇప్పటికే గండిపేటకు చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసిన పోలీసులు, తాజాగా నకిలీ జీవోలు సృష్టించిన ప్రధాన నిందితుడు వెలది రాధాకృష్ణ (53), అతని డ్రైవర్ గ్యారా ప్రవీణ్ కుమార్ (34)లను అరెస్టు చేసినట్లు శేరిలింగంపల్లి డీసీపీ సిహెచ్.శ్రీనివాస్ వెల్లడించారు. ఆదివారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు పూర్వాపరాలను వివరించారు. గండిపేట గ్రామ సర్వే నంబర్ 18లోని ప్రభుత్వ పోరంబోకు భూమిపై అక్రమ హకులు సృష్టించేందుకు నకిలీ ప్రభుత్వ పత్రాలు తయారు చేసిన వ్యవహారంలో నార్సింగి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 990/2026 కింద నమోదైన విషయం తెలిసిందే.

**సెక్రటేరియట్ ఉద్యోగి నుంచి మోసగాడిగా...**

వెలది రాధాకృష్ణ 2006 నుంచి 2009 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ఐటీ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేశాడు. ఆ సమయంలో ప్రభుత్వ కార్యాలయాల విధానాలపై అవగాహన పెంచుకున్న నిందితుడు, అనంతరం ఉద్యోగం వదిలి ఆ పరిచయాలను మోసాలకు వినియోగించడం ప్రారంభించాడు. ఈ క్రమంలో తాను సచివాలయంలో డిప్యూటీ కలెక్టర్‌నని, అడ్వకేట్‌నని చెప్పుకుంటూ ప్రభుత్వ ఉద్యోగాలు, భూ రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు, పట్టాదారు పాస్ బుకులు, వారసత్వ ధ్రువీకరణలు, ఇతర ప్రభుత్వ అనుమతులు ఇప్పిస్తానని ప్రజలను నమ్మించి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. 2013లో నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి సుమారు రూ.30 లక్షలు వసూలు చేసి, మోసగించిన కేసులో కరీంనగర్ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రాధాకృష్ణపై తొలిసారి నమోదైంది. అయినప్పటికీ ప్రవర్తన మార్చుకోకుండా నిందితుడు పలువురిని ఇదే తరహాలో మోసం చేస్తూ డబ్బులు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. సచివాలయంలో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని వెంకటాచారి అనే వ్యక్తి నుంచి రూ.18 లక్షలు, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని మొయినాబాద్‌కు చెందిన దివాకర్ నుంచి రూ.3 లక్షలు తీసుకుని మోసం చేసినట్లు కేసులు నమోదయ్యాయి. రాజేంద్రనగర్, నేరేడ్ మెట్, గోదావరిఖని, కరీంనగర్, కర్నూలు జిల్లాల్లోని పలు పోలీస్ స్టేషన్లలో సైతం నిందితుడిపై అనేక కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు.


**భూ కుంభకోణాల వైపు....**

ఉద్యోగాల పేరుతో చేసిన మోసాల ద్వారా వచ్చిన డబ్బుతో విలాసవంతమైన జీవితం గడిపిన రాధాకృష్ణ, అనంతరం భారీ లాభాల కోసం భూ మోసాల వైపు మళ్లినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ క్రమంలో గండిపేట గ్రామ సర్వే నంబర్ 18లోని ప్రభుత్వ భూమిపై హకులు ఉన్నట్లు చెప్పుకునే వ్యక్తులతో పరిచయం పెంచుకుని, ఆ భూమి ద్వారా భారీగా డబ్బు సంపాదించాలని యోచించినట్లు దర్యాప్తులో తేలింది. తన డ్రైవర్ ప్రవీణ్ కుమార్ ద్వారా కొవ్వూరు సునీల్‌తో పరిచయం పెంచుకున్న రాధాకృష్ణ, నిమ్మల రాజేష్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల రామస్వామి, గారెల మంగా, వారి కుటుంబ సభ్యులతో సంబంధాలు ఏర్పరచుకుని భూకబ్జాలకు అవసరమైన నకిలీ పత్రాలు సృష్టించేందుకు కుట్ర పనిన్నట్లు తెలిపారు.

గండిపేట భూమి పూర్తిగా ప్రభుత్వ పోరంబోకు భూమి అని, దానిపై ఎటువంటి చట్టబద్ధ హకులు లేవని రాధాకృష్ణకు తెలిసినప్పటికీ, నకిలీ పత్రాలు సృష్టించి ఇస్తానని, భూమిని కొనుగోలు చేయాలనుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు, అతని సోదరుడు రమేష్‌లతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. వారి నుంచి భారీగా డబ్బులు తీసుకున్న నిందితులు, తరువాత అసలు ప్రభుత్వ అనుమతులు పొందడం సాధ్యం కాదని తెలుసుకున్న రాధాకృష్ణ, మరో అడ్వకేట్ సహాయంతో కలిసి నిమ్మల రాజేష్, వేణుగోపాల్, రామస్వామి, గారెల మంగా, బ్రహ్మనాయుడు, రమేష్ తదితరులతో కలిసి నకిలీ జీవోలు, తప్పుడు సీసీఎల్ ఏ ప్రొసీడింగ్స్, నకిలీ ఎన్‌వోసీలు, అధికారిక లేఖలు, ఇతర ప్రభుత్వ పత్రాలను తయారు చేశారు. ఈ పత్రాల్లో సీనియర్ ప్రభుత్వ అధికారుల పేర్లు, సంతకాలను ఫోర్జరీ చేసి అవి అసలైన ప్రభుత్వ ఉత్తర్వుల మాదిరిగా కనిపించేలా రూపొందించినట్లు వెల్లడైంది. ఈ భూమి వ్యవహారంలో బ్రహ్మనాయుడు, రమేష్ ఇతర వ్యక్తుల మధ్య సుమారు రూ.12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. వీటిపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు. ఈ వ్యవహారంలో కేసు నమోదైన తరువాత రాధాకృష్ణ పరారయ్యేందుకు ప్రయత్నించగా, అతని డ్రైవర్ ప్రవీణ్ కుమార్ పత్రాలను దాచిపెట్టడం, సమాచార మార్పిడిలో సహకరించడం, పోలీసుల కదలికలను తెలియజేయడం వంటి చర్యల ద్వారా నిందితుడికి ప్రత్యక్షంగా సహాయం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. దీంతో డ్రైవర్ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి నకిలీ ప్రభుత్వ జీవోలు, 5 ల్యాప్ టాప్ లు, 12 చెక్ బుకులు, 13 స్టాంపులు, 7 బ్యాంక్ పాస్ బుకులు, 10 ఏటీఎం కార్డులు, 31 భూ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నట్లు డీసీపీ తెలిపారు.

# ఉపాధి హామీలో 'ఫీల్డ్' మాయాజాలం!

- రెక్కాడకుండానే నిండుతున్న అక్రమార్కుల డొక్క
- జన్నారం మండలంలో యథేచ్ఛగా 'సగం-సగం' దందా
- ఇంట్లో కూర్చున్నా పడుతున్న బిల్లులు.. పట్టించుకోని అధికారులు




**తొలివెలుగు, జన్నారం:** గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు చేతినిండా పని కల్పించి, బతుకుదెరువు కోసం జరిగే వలసలను నివారించాలనే సత్సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' కొందరు అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాల్సిన కొందరు అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు చేతులు కలపడంతో ఉపాధి నిధులు దారి తప్పుతున్నాయి. అర్హులైన పేద కూలీల పొట్ట నింపాల్సిన ప్రభుత్వ సొమ్ము.. కష్టపడకుండానే కేటుగాళ్ల జేబుల్లోకి చేరుతోంది. పనులకు వెళ్లకుండానే ఇంట్లో కూర్చున్న వారికి సైతం భారీగా బిల్లులు చెల్లిస్తూ, అందులో సగం వాటాలు దండుకుంటూ సరికొత్త దోపిడీకి తెరలేపారు.

**కాగితాలకే పరిమితమైన పనులు..**

జన్నారం మండలంలోని చాలా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం... కూలీలు రోజువారీగా పని ప్రదేశానికి వెళ్లి నిర్ణీత సమయంలో పనులు చేయాల్సి ఉంటుంది. కానీ, మండలంలోని పలు గ్రామాల్లో సీన్ రివర్స్ అయింది. గ్రామంలోని కొందరు బడా బాబులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ముందస్తుగా ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. వీరు ఒక్క రోజు కూడా పనికి వెళ్లరు, కనీసం గునపం, పార కూడా పట్టుకోరు. కానీ, ప్రతి వారం వీరి ఖాతాల్లోకి డబ్బులు జమవుతున్నాయి. కాయకష్టం చేసే పేదవాడికి కూలి దక్కడం గగనమవుతుంటే.. ఇక్కడ మాత్రం ఎలాంటి శ్రమా లేకుండా అక్రమార్కుల డొక్క నిండుతుండటం గమనార్హం.

**'సగం-సగం' ఒప్పందం!**

జన్నారం మండలంలోని గ్రామాలలో ఈ అక్రమాలు భారీగా సాగుతున్నట్లు తెలుస్తోంది. పనికి రాని వారి పేర్లను మస్టర్లలో నమోదు చేసి, ఆన్లైన్ హాజరు వేస్తున్నారు. ఖాతాల్లో బిల్లు పడగానే, సదరు లబ్ధిదారుడి నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లు 50 శాతం కమీషన్ వసూలు చేస్తున్నారని, అక్కడ ఈ 'సగం-సగం' ఒప్పందం జోరుగా సాగుతోందని ఉపాధి కూలీలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. అంటే కష్టపడకుండా కూలీకి సగం, ఏమీ చేయకుండా ఫీల్డ్ అసిస్టెంట్‌కు సగం అన్నమాట! ఇంట్లో కూర్చున్న వారికి అక్రమంగా బిల్లులు చెల్లిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు... ఎండనక, వాననక కష్టపడే నిజమైన కూలీల పొట్ట కొడుతున్నారు. క్షేత్రస్థాయిలో నిజాయితీగా పనిచేసే కూలీలకు రకరకాల సాకులు చెప్పుతూ బిల్లులు సకాలంలో చెల్లించకుండా తిప్పించుకుంటున్నారు. పని చేయని వారికి మాత్రం నిమిషాల్లో బిల్లులు పడిపోతుండటం వెనుక ఉన్న మతలబు ఏమిటని తోటి కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బయోమెట్రిక్, జియో ట్యాగింగ్ వంటి సాంకేతికతను కూడా ఈ కేటుగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటూ ప్రభుత్వ నిధులను యథేచ్ఛగా దోచుకుంటున్నారు.

**ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏది?**

జన్నారం మండల వ్యాప్తంగా ఈ భారీ అక్రమాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నా ఉన్నతాధికారులు మాత్రం కంటితుడుపు చర్యలతో సరిపెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఏటా నిర్వహించే 'సోషల్ ఆడిట్' (సామాజిక తనిఖీ) కేవలం రికార్డుల సరిచూడటానికే పరిమితమవుతోందని, క్షేత్రస్థాయి పరిశీలన శూన్యమని స్థానికులు మండిపడుతున్నారు. ఎపిఓ, ఈసీ వంటి అధికారులు క్షేత్రస్థాయి పనులను క్రమం తప్పకుండా పరిశీలించాల్సి ఉన్నా, కార్యాలయాలకే పరిమితం కావడం ఈ అక్రమార్కులకు మరింత వరంగా మారింది. నిజాయితీగా పనిచేసే కూలీలకు సకాలంలో, పూర్తిగా బిల్లులు ఇవ్వకుండా... అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న జన్నారం మండల ఫీల్డ్ అసిస్టెంట్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, జన్నారం మండలంలోని అన్ని గ్రామాల్లో ముఖ్యంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్రామాలలో తక్షణమే ఉన్నత స్థాయి విచారణ జరపాలని, నకిలీ మస్టర్లపై నిఘా పెట్టి బాధ్యులైన ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# చిన్నారుల నృత్యార్చన.. వారాహి సమ్మర్ క్యాంపు ముగింపు

- నెల రోజుల పాటు సాగిన శిక్షణ శిబిరం
- చిన్నారుల అద్భుత ప్రదర్శనలతో అలరించిన ముగింపు వేడుకలు
- భారతీయ సంస్కృతికి ప్రతీకలు శాస్త్రీయ నృత్యాలు
- నిర్వాహకులు: ఎడ్ల హిమబిందురెడ్డి, సామినేని దీపిక







**తొలివెలుగు, చౌటుప్పల్:** స్థానిక పట్టణ కేంద్రంలోని రత్నానగర్‌లో ఏర్పాటుచేసిన వారాహి డాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో చిన్నారుల కోసం నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి నృత్య శిక్షణ శిబిరం (సమ్మర్ క్యాంపు) ఆదివారం ఘనంగా ముగిసింది. ప్రముఖ నృత్య దర్శకులు ప్రిన్స్ భరత్, మిక్కీ మాస్టర్ల పర్యవేక్షణలో చిన్నారులు గత నెల రోజులుగా వివిధ రకాల నృత్య రీతుల్లో శిక్షణ పొందారు. ముగింపు వేడుకల సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

**నృత్యం సంస్కృతిలో భాగం:**

ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన స్టూడియో నిర్వాహకురాళ్ళు ఎడ్ల హిమబిందురెడ్డి, సామినేని దీపిక జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. భారతదేశం అనాదిగా ఎన్నో అద్భుతమైన శాస్త్రీయ నృత్యాలకు పుట్టినిల్లుగా విరాజిల్లుతోందని కొనియాడారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయిన మన దేశంలో, ప్రతి రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను ఆయా ప్రాంతాల నృత్యాలు ప్రతిబింబిస్తాయని తెలిపారు. భరతముని ప్రసాదించిన నాట్యశాస్త్రం ప్రకారం.. అభినయం, నాట్యం సమపాళ్లలో కలగలిసినప్పుడే అది పరిపూర్ణ శాస్త్రీయ నృత్యంగా మారుతుందని వివరించారు. ప్రస్తుత ఆధునిక కాలంలో భారతీయ సినిమా రంగంలో సైతం నాట్యం సరికొత్త సాంకేతికతతో ప్రత్యేకతను సంతరించుకుంటూ ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకుంటోందని గుర్తుచేశారు. ఈ వేసవి శిబిరానికి తమ పిల్లలను పంపి, వారు సరికొత్త కళలు నేర్చుకునేలా ప్రోత్సహించిన తల్లిదండ్రులకు స్టూడియో తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

